క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడి పందేల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

పొన్నూరు: సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ భార్గవ్ హెచ్చరించారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం పందెల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి జూదం వద్దు.. సంప్రదాయమే ముద్దు అనే విధంగా ఉండాలని తెలిపారు. జూదం కాకుండా క్రీడల్ని ప్రోత్సహిస్తే యువతీ, యువకులకు ఉల్లాసంగా ఉంటుందని సూచించారు.

బాజీ బాబా దర్గా ప్రహరీ నిర్మాణం ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న దర్గా ఈఓ షేక్ ముఖ్తార్ బాషా తదితరులు

పెదకాకాని: బాజీబాబా దర్గా ప్రహరీ నిర్మాణం పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా రూ. 98 లక్షలు విడుదల చేసింది. దర్గా వెనుక వైపు పల్లాలమ్మ చెరువు ఆక్రమించుకుని కొందరు నివాసాలు ఉంటున్నారు. ప్రహరీ నిర్మాణంలో వారితో సమస్యలు తలెత్తాయి. ఈవో ముఖ్తార్ బాషా, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, గ్రామ ఉప సర్పంచి వలివేటి మురళి, షేక్ ఆరిఫ్ మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అడ్డంకులు తొలగిపోవడంతో బుధవారం పనుల్ని ప్రారంభించారు.

పౌష్టికాహారంపై అవగాహన

పొన్నూరు: మండలంలోని వచ్చలతాడిపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం మహిళలకు, పిల్లలకు రక్తహీనతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత పెరికల కృష్ణ మోహన్ మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా ఇంటి పనులు చేస్తూ సకాలంలో సరైన ఆహారం తీసుకోవకపోవడం వల్ల రక్తహీనతకు గురవ్వుతారని తెలిపారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. రక్తహీనత నివారణకు ప్రతి రోజు పాలు, గుడ్లు, కూరగాయలు, పప్పు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రేమలత, సుభవేణి, సునీత, పర్వీన్ పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

గుంటూరు రూరల్: సంక్రాంతి పండుగ మన సంస్కృతీ, సంప్రదాయాలకు చిహ్నమని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భావితరాలకు మన పండుగలు తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల్ని తెలియజేస్తాయని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్రీడలు, ముగ్గులు, వివిధ రకాల పోటీల్ని నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ పి. బాబు, డైరెక్టర్ కె. హరిబాబు పాల్గొన్నారు.

శ్రీ గోదా పద్మావతి అమ్మవారికి విశేష పూజలు



పాత గుంటూరు: కృష్ణనగర్‌లోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రధానార్చకుడు ధనకుదరం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం శ్రీ గోదా పద్మావతి అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి అనంతరం కూడారై ప్రసాద విశేషాలను శ్రీనివాసాచార్యులు భక్తులకు వివరిస్తూ, స్వామికి నివేదించిన ఈ ప్రసాదాన్ని అందరూ సేవించడం విశేషమని తెలిపారు. భక్తులకు అక్షయ పాత్ర సహిత కూడారై ప్రసాదాన్ని అందించారు.

జీవో నంబర్-1 రద్దు చేయాలి

నెహ్రూనగర్: జీవో నంబర్–1ని రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని అంబేడ్కర్ మినీ హాలులో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్ వై. కోటేశ్వరరావు (వైకే) మాట్లాడుతూ పౌర, ప్రజాస్వామ్య హక్కుల్ని హరించే విధంగా ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్- 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై 13న కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకులు ఊటికొండ నరసింహారావు, రవిచంద్ర, రమణయ్య, గంట ప్రభుదాసు, సాంబశివరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- కనుకర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన
- ప్రతి ఇంటికీ చేరుతున్న ప్రభుత్వ పథకాలు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండలంలోని కనుకర్రులో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని సమస్యల్ని స్థానికుల్ని అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని వివరించారు. మూడేళ్లలో నవరత్నాల రూపంలో పేదలకు అందించిన పథకాలపై అవగాహన కల్పించారు. ఇది బడుగు, బలహీనవర్గాల సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని ప్రభుత్వ పథకాల్ని నేడు మన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం ఆనాడు మహాత్మా గాంధీ ఎంతగానో పోరాడారని, నేడు సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి సచివాలయాల్ని తీసుకు వచ్చి ఆయన కలల్ని నిజం చేశారని వివరించారు. ప్రతి ఒక్కరి సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల్ని పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత పాలకులు మాటలతో కాలయాపన చేశారని ఎమ్మెల్యే కిలారి విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా ఇప్పటికే 98.4శాతం హామీల్ని అమలు చేసి దేశంలో ఏ నాయకుడికీ అందనంత ఎత్తులో నిలిచారని కొనియాడారు. వలన మాలపల్లె పాఠశాలలో బెంచీలు వెంటనే సమకూర్చాలని ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్‌కి చెప్పారు. నివేశ స్థలాలు, పింఛన్లు అందని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వై.ఎస్. రాజశేఖరరెడ్డి, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అనంతరం పట్టణంలోని 28వ వార్డులో డ్రైనేజ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, మున్సిపల్ కమిషనర్ ఎన్.రాధ, నాగిశెట్టి నరసింహ, రమేష్, కిలారి ప్రసాద్, అంకినీడు, ప్రకాష్, కిరణ్, రవి, సుబ్బారావు, దాసరి నారాయణరావు, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ సైపుల్లా, మాము, బొద్దులూరి రంగారావు, అంబటి వెంకటేశ్వరరావు, వడ్డిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

క్వారీల పాపం టీడీపీ నాయకులదే..

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ధ్వజం
- టీడీపీ హయాంలో జెడ్పీ భూముల్లో తవ్విన ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, స్థానిక నేతలు
- గ్రావెల్ డాన్ టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర



వడ్లమూడి క్వారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు

చేబ్రోలు: ప్రభుత్వ భూముల్ని క్వారీలుగా మార్చిన ఘనత టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు మాత్రమే దక్కుతుందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్లమూడి గ్రామ పరిధిలోని జడ్పీ భూముల్లో టీడీపీ ప్రభుత్వ కాలంలో ధూళిపాళ్ల నరేంద్ర అతని అనుచరులు తవ్విన క్వారీలను శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. 45 ఎకరాల జిల్లా పరిషత్, రైల్వే భూముల్లో తెలుగుదేశం నాయకులు తవ్విన క్వారీ ప్రాంతాల్ని పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో విచారణ జరిపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ఐదు పర్యాయాలు ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసి చెప్పుకోవటానికి ఒక్క అభివృద్ధి పనులు చేయలేని నరేంద్ర వైఎస్సార్ సీపీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. గ్రావెల్ డాన్‌గా పేరుగాంచిన ధూళిపాళ్ల నరేంద్ర చేబ్రోలు మండలంలో వందల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ హయంలో వేజండ్లలో చెరువు క్వారీలు తవ్వకాలు జరుపుతున్నప్పుడు ఇద్దరు చిన్నారులు, శేకూరు క్వారీలో రైతు చనిపోయారని తెలిపారు. వడ్లమూడి, చేబ్రోలు, సుద్దపల్లి, శలపాడు, వీరనాయకునిపాలెం తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములు, రైల్వేభూములు, చెరువులను క్వారీలుగా మార్చి టీడీపీ నేతలు కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. నీరు –చెట్టు పేరుతో సుద్దపల్లిలో తవ్వకాలు జరపటానికి ప్రయత్నించటంతో గ్రామస్తులు తిరగబడ్డారని గుర్తు చేశారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, గ్రామ సర్పంచులు, అధికారులతో విచారణ జరిపించి ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కె. సాహితి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, ఈశ్వరరెడ్డి, వెంకటరెడ్డి, దాసరి నారాయణరావు, ఎస్. ఆదియ్య, జాని, బి. రంగారావు, చుక్కా నాగబాబు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోతే చర్యలు

డీపీవో కేశవరెడ్డి

ప్రత్తిపాడు: 'ప్రతి వారం సమావేశాలు పెడుతున్నాం.. ఫీల్డ్‌కి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతున్నాం.. అక్కడ గుర్తించిన సమస్యలకు పరిష్కారం చూపకుండా, నిర్మాణంలో పురోగతి లేకుండా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు' అంటూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి ఫైర్ అయ్యారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జగనన్న ఇళ్ల నిర్మాణంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉద్యోగులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో డీపీవో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లకుండా, వాళ్లే వస్తారులే అని చూస్తున్నారని.. ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టని వారి వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అది మానేసి ప్రతిసారి సమావేశాల్లో ముచ్చట్లు చెబుతున్నారని, ఇకపై చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ నిబంధనలు పాటించాలి

డీటీసీ షేక్ కరీం



పట్నంబజారు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం నిబంధనలు పాటించాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. ప్రైవేటు బస్సుల డ్రైవర్లకు బుధవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలతో పాటు సరుకు రవాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రయాణికుల రికార్డుల్ని తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అనుమతి లేని సరుకు రవాణాతో పాటు డ్రైవర్ల మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్టీసీ చార్జీల్ని ప్రామాణికంగా తీసుకుని వాటిననుసరించి ధరలు నిర్ణయించాలని చెప్పారు.

పల్నాడు బస్ స్టాప్‌లో కార్గో సెంటర్ ప్రారంభం

పాత గుంటూరు: గుంటూరు మార్కెట్ సెంటర్లోని పల్నాడు బస్ స్టాప్‌లో ఆర్టీసీ నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సెంటర్‌ను బుధవారం గుంటూరు- 2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలు హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై నగరాలకు కూడా పార్శిల్ బుకింగ్ చేయనున్నట్లు తెలిపారు. బల్క్ లోడు (10 నుంచి 12 టన్నుల వరకు)కు ప్రత్యేకంగా కార్గో వెహికల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివరాలకు 80195 40175లో సంప్రదించాలని సూచించారు.

818 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్ని పురస్కరించుకుని వెనిగండ్లలో ఇటీవల బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 818 మందికి బుధవారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్య శిబిరాల్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనవరి 4న వెనిగండ్లలో నేత్ర జ్యోతి పేరుతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి 1078 మందికి కంటి పరీక్షలు చేశామని తెలిపారు. ఇందులో కళ్లజోళ్లు అవసరమైన 818 మందికి ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. విద్యాజ్యోతి పేరుతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, వలంటీర్లకు అవగాహన, పోటీ పరీక్ష నిర్వహించి బహుమతులు అందించినట్లు పేర్కొన్నారు. 23 మంది వలంటీర్లకు రూ. 5 లక్షల విలువైన ప్రమాద బీమా పాలసీలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆత్మకూరి శ్రీనివాసరెడ్డి, దాగంటి మురళీమోహన్‌రెడ్డి, కొల్లి పిచ్చిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పలు పాఠశాలల్ని సందర్శించిన పాఠశాల విద్య డెప్యూటీ కమిషనర్



ఉప్పలపాడు పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న జయశ్రీ

పెదనందిపాడు: మండలంలోని పలు పాఠశాలల్ని రాష్ట్ర పాఠశాల విద్య డెప్యూటీ కమిషనర్, ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంఎస్) స్పెషల్ ఆఫీసర్ ఏ.ఎం.జయశ్రీ సందర్శించారు. పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొప్పర్రు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, ఉప్పలపాడు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలల్ని బుధవారం మధ్యాహ్నం ఆమె పరిశీలించారు. పాఠశాలల్లో రికార్డులు, విద్యార్థుల వర్క్‌బుక్‌లతో పాటు వసతుల్ని ఆమె పరిశీలించారు. ఉప్పలపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఈ మూడు స్కూళ్లు ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కింద ఎంపికయ్యాయని ఆమె తెలిపారు. ఆమె వెంట సర్వశిక్ష అభియాన్ ఏపీవో సీతారామయ్య, ఎంఈవో డి. బాలసుబ్రహ్మణ్యం, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

తరగతి గదుల్లోనే ఆవిష్కరణలకు అంకురార్పణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: తరగతి గదుల్లోనే ఆవిష్కరణలకు అంకురార్పణ జరుగుతుందని హిందూ కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ కళాశాలలో బుధవారం బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. విద్యార్థులు తమ కృషితో పాఠ్యపుస్తకాలు, తరగతి గదులు దాటి విశ్వంలో రహస్యాల్ని ఛేదించాలని సూచించారు. సాంకేతిక రంగంలో భారతదేశ శాస్త్రవేత్తలు చేసిన కృషితో దేశం వివిధ రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టిందని తెలిపారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాల్ని అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి వెళ్లాలని సూచించారు. సభానంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

జీవన శైలి మార్పుతోనే అభ్యున్నతి

ర్యాగ్ పికర్స్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి సూచన

నెహ్రూనగర్: కాలానుగుణంగా ర్యాగ్ పికర్స్(రోడ్ల వెంట కాగితాలు ఏరుకునేవారు) జీవన శైలిని మార్చుకుని అభివృద్ధి చెందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ టి. ప్రేమకుమారి సూచించారు.ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం సీఐపీఈటీ విజయవాడ ఆధ్వర్యంలో ర్యాగ్ పికర్స్‌కు జీవనోపాధి పెంపుపై శిక్షణతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో పథకాల్ని అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకుని అభివృద్ధిలోని రావాలని సూచించారు.

నగరపాలక సంస్థ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ 200 మందికి పైగా ర్యాగ్ పికర్స్‌కు నగరపాలక సంస్థలో కార్మికులుగా ఉద్యోగాల్ని కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వెంకట నారాయణ, ఎస్ఐ కోటేశ్వరరావు, సీఐపీఈటీ ట్రైనింగ్ అధికారి కామేశ్వరరావు, అంజినాయక్, డీబీఆర్‌సీ నాయకులు శామ్యూల్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి



ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న పీడీ యుగంధర్

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం జిల్లా సంచాలకుడు వై.యుగంధర్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జాబ్ కార్డులు లేని వారిని గుర్తించి వారికి కొత్తవి మంజూరు చేయాలని ఆయన చెప్పారు. జనవరిలో మండలానికి 62 వేల పని దినాలుగా టార్గెట్ చేశామని, వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. అనంతరం మండలంలోని పెద్దివారిపాలెం, పాండ్రపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న పనుల్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.శరత్‌బాబు, ఇన్‌చార్జి ఏపీఓ సింగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మండలంలో రెండు నర్సరీలు

ప్రత్తిపాడు: ప్రతి మండలంలో రెండు నర్సరీలు కచ్చితంగా ఉండాల్సిందేనని డ్వామా పీడీ యుగంధర్ ఆదేశించారు. ప్రత్తిపాడులోని ఉపాధిహామీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, కూలీల హాజరు వివరాల్ని ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీగా ఉన్న గ్రామాలకు సంబంధించిన ప్రపోజల్స్ పంపితే కొత్త వారిని నియమిస్తామని చెప్పారు. అప్పటివరకు పనులు ఆగకుండా సీనియర్ మేట్స్‌తో గ్రామాల్లో ఉపాధి పనులు చేయించాలని చెప్పారు. మండలంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు మునగ నర్సరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ నెల 16వ తేదీ నాటికి ఇచ్చిన లక్ష్యాల్ని పూర్తి చేసేలా ఉపాధి హామీ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, లేని పక్షంలో తొలగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో చదివితేనే ఉన్నత స్థానం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ శోభాచంద్

పొన్నూరు: కృషి, పట్టుదలతో చదివితేనే ఉన్నత స్థాయికి చేరుతారని ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్ పేర్కొన్నారు. తెలగపాలెం ఎన్నారై బిల్డింగ్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులకు స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనరల్ నాలెడ్జి, వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆలోచనల్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువతే దేశానికి వెన్నెముక అని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వసువు లేటి హేమలత, దేవిరెడ్డి శివ నాగేశ్వరరావు, మొవ్వా జగదీష్, ఉదయ్ భాస్కర్, ఆంజనేయులు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న పాఠశాల సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ ఆంథోని

గుంటూరు రూరల్: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగు పడవచ్చని లయోలా పబ్లిక్ స్కూల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ పి.ఆంథోని తెలిపారు. మండలంలోని నల్లపాడు లయోలా పాఠశాలలో బుధవారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో ఎడ్యుకేషనల్ విస్టా- 2023 పేరుతో వినూత్నంగా విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతకు నిలువెత్తు నిదర్శనం ఈ ప్రదర్శనలని తెలిపారు. వచ్చే ఏడాది మరింత వినూత్నంగా ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ సునీల్, రెవరెండ్ ఫాదర్ నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌పై ఏడు అడుగుల పాము

మండలంలోని పలు గ్రామాలకు నిలిచిన సరఫరా



విద్యుత్ పోల్‌పై వేలాడుతున్న పాము, ఇన్‌సెట్‌లో విద్యుత్ షాక్ తో చనిపోయిన సర్పం

ప్రత్తిపాడు: సహజంగా లైన్స్ ట్రిప్ అయ్యో.. వైర్లు తెగో.. పోల్స్ విరిగిపడితేనో.. లేక ప్రకృతి విపత్తుల సమయాల్లోనో పోల్స్ దెబ్బతిన్న సందర్భాల్లోనూ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కానీ ఇక్కడ మాత్రం అలా కాదు. ఒక పాము విద్యుత్ పోల్ పై పడటంతో దాదాపుగా పది గ్రామాలకు కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిపాలెం సబ్ స్టేషన్ నుంచి ఈదులపాలెం సబ్ స్టేషన్‌కు అక్కడి నుంచి ప్రత్తిపాడు సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రత్తిపాడు సబ్ స్టేషను నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా వెళుతుంది. అయితే, ఈదులపాలెం సమీపంలోని ఒక విద్యుత్ పోల్‌పై బుధవారం ఉదయం పాము పడటంతో రెండు వైర్లు కలిసి పవర్ ట్రిప్ అయ్యింది. దీంతో హైవేను ఆనుకుని ఉన్న ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది సమస్యను తెలుసుకునేందుకు మూడు నాలుగు గంటల పాటు నానా అగచాట్లు పడ్డారు. ఆయా గ్రామాల్లోని సుమారు 150 విద్యుత్ స్తంభాల్ని గాలించారు. తీరా ఈదులపాలెం సమీపంలో ఒక స్తంభంపై పాము పడి ఉండటం గమనించి దాన్ని తీశారు. ఏదైనా పక్షి అక్కడ పామును వదిలేసి వెల్లడమో, లేక పై నుంచి వెళ్లే సమయంలో పక్షి నోటి నుంచి జారి కింద పడటమో జరిగి ఉంటుందని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు.

తాగునీటి సరఫరాలో అప్రమత్తత అవసరం

కమిషనర్ కీర్తి చేకూరి



ట్యాంకును పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు కీలకమైన తాగునీటి సరఫరాలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వరకు వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు రిజర్వాయర్లు, ఫిల్టరేషన్ పాయింట్స్, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ఏటుకూరులోని చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, రిజర్వాయర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్స్, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో నిర్మించిన సీసీ రోడ్డు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. నాణ్యత, కొలతల్ని తనిఖీ చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో తాగునీటి కొరత రాకుండా, ఎక్కడా కలుషిత నీటి సరఫరా జరగకుండా పటిష్ట ప్రణాళిక అవసరమని చెప్పారు. ఏటుకూరు చెరువు పరిసరాల్లోకి ఇతరులు రాకుండా గేటు ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ వద్ద ఫిల్టర్ బెడ్స్ పనుల్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటిని సమృద్ధిగా ఇవ్వడానికి వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, ఎస్ఈ భాస్కర్, ఈఈలు కొండారెడ్డి, శాంతిరాజు, డీఈఈలు శివకుమార్, కళ్యాణరావు, ఏఈలు రాంబాబు, రవికిరణ్, బాబర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.